క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక

దేవరకొండ: పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అక్కంపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహ, పరమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



జలాభిషేకం చేయడానికి బిందెలతో వెళ్తున్న మహిళలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): వర్షాలు కురవాలని తిరుమలగిరి మండలంలోని సుంకిశాలతండా గ్రామస్తులు ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి జలాభిషేకం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

వట్టె జానయ్యపై రాజకీయ కక్ష తగదు

మిర్యాలగూడ టౌన్: ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌పై రాజకీయ కక్షతో కేసులు పెట్టించడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జానయ్యయాదవ్ రాజకీయంగా ఎదుగుతుంటే అగ్రవర్ణాల నేతలు తమ కుటిల రాజకీయాలతో అణగదొక్కాలని చూస్తున్నారని అన్నారు. బీసీలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడితే రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. వట్టె జానయ్యయాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మిర్యాలగూడ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి



గాంధీభవన్‌లో మిర్యాలగూడ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న మాధవి

నల్లగొండ: మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను తనకు కేటాయించాలని జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గోపగాని మాధవి కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని ఆదివారం ఒక ప్రకటన ద్వారా కోరారు. మిర్యాలగూడ టికెట్ కోసం ఇటీవల గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీలో బీసీ మహిళగా మిర్యాలగూడ నుంచి తనకు అవకాశం కల్పించాలని కోరారు. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం ఎంతో కృషి చేస్తున్నానని అన్నారు. త్రిపురారం మండల వైస్ ఎంపీపీగా, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశానని తెలిపారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రెండోసారి పనిచేస్తున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ ప్రకారం మిర్యాలగూడ టికెట్ తనకు వస్తుందని, తనకు అవకాశం కల్పిస్తే గెలుపొందుతానని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి



అల్వాలలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ యాదగిరి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని తహసీల్దార్ యాదగిరి అన్నారు. ఆదివారం తిరుమలగిరి మండలంలోని శ్రీరాంపురం, జానారెడ్డి కాలనీ, అల్వాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటరు జాబితాలో ఫొటో, ఇతర మార్పులు ఉన్నట్లయితే ఫారం–బి ద్వారా ఓటర్లతో సరిచేయించేలా చూడాలన్నారు. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. మరలా సెప్టెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు ఎప్పుడిస్తరో..?

- డీడీలు తీసి నెలలు గడుస్తున్నా నేటికీ అందని గొర్రెల యూనిట్లు
- వడ్డీకి తెచ్చి డీడీలు చెల్లించామని లబోదిబోమంటున్న గొల్ల కురుమలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బొడ్డు అంజమ్మ. ఈమెది తిరుమలగిరి(సాగర్) మండలం యల్లాపురం గ్రామం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీలో భాగంగా రెండో విడతలో లబ్ధిదారుగా ఎంపికయ్యింది. దీంతో ఆమె వాటా కింద రూ.43,750 డీడీ చెల్లించాలని అధికారులు పేర్కొన్నారు. అప్పుడు ఆమె దగ్గర డబ్బులు లేక అధిక వడ్డీకి అప్పు తెచ్చి మరీ డీడీ తీసింది. డీడీ తీసి నెలలు గడుస్తున్నా నేటికీ గొర్రెలు అందకపోవడంతో అప్పు ఎలా తీర్చాలోనని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇది ఒక్క అంజమ్మ ఆవేదనే కాదు. రెండో విడతలో డీడీలు తీసిన లబ్ధిదారులందరి పరిస్థితి ఇలాగే ఉంది.



తిరుమలగిరి (నాగార్జునసాగర్): గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం గొర్రెల యూనిట్ల పంపిణీకి 2017లో శ్రీకారం చుట్టింది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి గొల్ల కురుమ లబ్ధిదారుని గొర్రెల యూనిట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో సంఘాలను ఏర్పాటు చేసుకొని, సంఘాలను రిజిస్టర్ చేయించారు. మండల వ్యాప్తంగా 2005 మంది లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు తేల్చారు. రెండు విడతలుగా పంపిణీ చేపడతామని ప్రభుత్వం పేర్కొనడంతో మొదటి విడతలో కొన్ని గ్రామాల్లో లాటరీ పద్ధతిన, మరికొన్ని గ్రామాల్లో ఇళ్ల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడతలో భాగంగా 1001 మంది ఎంపికయ్యారు. ఇందులో ఇప్పటి వరకు 939 మందికి మాత్రమే గొర్రెల యూనిట్లు అందగా.. మండలంలోని చింతలపాలెం గ్రామంలో 62 యూనిట్లను మొదటి విడతలో అందించాల్సి ఉంది. పథకాన్ని ప్రవేశపెట్టి ఆరు సంవత్సరాలు అవుతున్నా నేటికీ మొదటి విడత కూడా పూర్తవ్వకపోవడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కొక్కరు రూ.43,750..

మొదటి విడతలో భాగంగా ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలతో పాటు ఒక పొట్టేలుకు రూ.1.25లక్షలు విలువ చేస్తే అందులో లబ్ధిదారుడు 25శాతం తన వాటా కింద రూ.31,200 డీడీ రూపంలో చెల్లించారు. మిగతా 75శాతం ప్రభుత్వం ఉచితంగా అందించింది. గతంలో కంటే ప్రస్తుతం గొర్రెలకు రేట్లు పెరగడంతో ప్రస్తుతం యూనిట్ ధరను ప్రభుత్వం రూ.1.75లక్షలకు పెంచింది. అందులో లబ్ధిదారుల వాటా రూ.43,750 కాగా మిగతా మొత్తం ప్రభుత్వం లబ్ధిదారునికి రాయితీ రూపంలో ఇస్తుంది. కాగా ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని కొన్ని నెలల కింది ప్రారంభించింది. రెండో విడతలో భాగంగా మండలంలోని యల్లాపురం, గోడుమడక, చింతలపాలెం, అల్వాల గ్రామాలను స్థానిక ఎమ్మెల్యే ఎంపిక చేశారు. దీంతో త్వరగా డీడీలు తీయాలని అధికారులు పేర్కొనడంతో ఈ గ్రామాల్లోని లబ్ధిదారులు 216 మంది ఐదు నెలల క్రితమే కలెక్టర్ ఖాతాలో డీడీ రూపంలో నగదు జమచేశారు. కానీ ఇప్పటి వరకు గొర్రెల పంపిణీ లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పు తెచ్చి మరీ డీడీలు చెల్లించామని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

అప్పు తెచ్చి డీడీలు కట్టినం



ప్రభుత్వం గొర్రెలు ఇస్తామని చెబితే ఆశతో నాలుగు నెలల క్రితం అప్పు తెచ్చి మరీ రూ.43,750 చెల్లించాం. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ గొర్రెలు వచ్చింది లేదు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వం కనికరం చూపించి మాకు గొర్రెలను పంపిణీ చేయాలి.

– వస్త్రపురి మల్లీశ్వరావు, లబ్ధిదారుడు, చింతలపాలెం

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం



చింతపల్లి: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



కొండమల్లేపల్లి: తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి: తెలంగాణ ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం చింతపల్లి మండల పరిధిలోని సాయిరెడ్డిగూడెం గ్రామంలో రూ.80లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోపిడి కిష్టారెడ్డి, ఉజ్జిని నరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ..

చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడు ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, రాష్ట్ర గీతకార్మికుల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్, రాష్ట్ర కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు అయిలి వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రుద్రమాదేవి, ఎంపీటీసీ కుంభం శ్వేతాశ్రీశైలం, బాదేపల్లి పులిరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయానికి ప్రతీక తీజ్..

కొండమల్లేపల్లి: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. కొండమల్లేపల్లి మండలంలోని గుడితండాలో ఆదివారం నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నేనావత్ అంజలిరాంబాబు, మేకల శ్రీనివాస్‌యాదవ్, నేనావత్ రాంబాబునాయక్, నేనావత్ రజిత, నేనావత్ శంకర్‌నాయక్, మధు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో కుటుంబ పాలనకు స్వస్తి



మాట్లాడుతున్న ఘజియాబాద్ ఎమ్మెల్యే అతుల్ గార్గే

మిర్యాలగూడ టౌన్: తెలంగాణలో మరో మూడు నెలల్లో కేసీఆర్ కుటుంబ పాలనకు ప్రజలు స్వస్తి పలకనున్నారని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అతుల్ గార్గే అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ప్రవాస్ యోజన సమావేశం ముగింపు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అనేక రకాలుగా నిధులను కేటాయిస్తుందని అన్నారు. తెలంగాణకు వ్యాగిన్ కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం మంజూరు చేసిందని పేర్కొన్నారు. దేశానికి నరేంద్ర మోదీ, యోగి ఆదిత్యనాథ్ లాంటి వారు ఎంతో అవసరమని అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని, తెలంగాణ సంపదనను సీఎం కేసీఆర్ ప్రభుత్వం అనుభవిస్తుందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ అభ్యర్థుల ఎంపిక కార్యకర్తల అభిప్రాయం మేరకే ఉంటుందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ మాటలను ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ సందర్భంగా అతుల్ గార్గేను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాఘవారెడ్డి, హన్మంతరెడ్డి, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, కనపర్తి సత్యప్రసాద్, కొండేటి సరిత, సీతారాంరెడ్డి తదితరులున్నారు.

గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి



నల్లమోతు సిద్దార్థకు వినతి పత్రం అందజేస్తున్న గద్దగూడతండా వాసులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం బి.అన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని గద్దగూడ తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించాలని కోరుతూ మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తనయుడు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్దార్థకు ఆదివారం తండావాసులు వినతిపత్రం అందజేశారు. అనంతరం తండావాసులు మాట్లాడుతూ.. గద్దగూడు తండాలో 800 మంది జనాభా ఉండగా.. ఓటర్లు 500 మంది వరకు ఉన్నారని అన్నారు. ఎమ్మెల్యే భాస్కర్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామపంచాయతీగా గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిట్టిబాబునాయక్, బాలునాయక్, బాబుసింగ్‌నాయక్, చంద్రునాయక్, జానునాయక్, రాంబాబు, మంగ్తానాయక్, రవి, నాగు, కిమా, మహేష్, శివాజీ, చంద్రశేఖర్, సురేష్ తదితరులున్నారు.

'నోముల భగత్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం'



హాలియాలో సమావేశమైన బీఆర్‌ఎస్ పార్టీ యాదవ సంఘం నేతలు

హాలియా: వచ్చే ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నోముల భగత్ గెలుపు కోసం కలిసి పనిచేద్దామని నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ యాదవ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం హాలియా పట్టణంలోని లక్ష్మీనరసింహ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ యాదవ సంఘం ముఖ్య నేతల సమావేశంలో ఎమ్మెల్యే నోముల భగత్‌కు రెండోసారి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి టికెట్ ప్రకటించిన సీఎం కేసీఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు యాదవ సంఘం నేతలు మాట్లాడారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేసింది నోముల కుటుంబమేనన్నారు. ఎమ్మెల్యే నోముల భగత్‌ని స్థానికేతరుడంటూ కొందరు వ్యక్తులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాగార్జునసాగర్‌లో జానారెడ్డిని ఓడించగల సమర్థుడు నోముల భగత్ మాత్రమే అని భావించే సీఎం కేసీఆర్ ఆయనకు మరోసారి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశించడం తప్పుకాదని, పార్టీ ఆదేశాలను ధిక్కరించి సీఎం నిర్ణయాన్ని వ్యతిరేకించి మాట్లాడడం సమర్థనీయం కాదని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, నిడమనూరు ఎంపీపీ బొల్లం జయమ్మ, మాజీ జెడ్పీటీసీ కూరాకుల అంతయ్య, గుర్రంపోడు వైస్ ఎంపీపీ ధనుంజయ, మాజీ మార్కెట్ చైర్మన్ చిన లింగయ్య యాదవ్, కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

భగత్ విజయానికి ఐక్యంగా కృషిచేయాలి..

గుర్రంపోడు: మండలంలోని బీఆర్‌ఎస్ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా నోముల భగత్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం గుర్రంపోడు మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్రంపోడు మండలంలో భగత్‌కు ఐదు నుంచి పదివేల మెజార్టీ వచ్చేలా కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దోటి చంద్రమౌళి, వజ్జ ధనుంజయ, రామగిరి చంద్రశేఖర్‌రావు, చాడ చక్రవర్తి, పోలేని ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే ప్రభు చౌహాన్

దేవరకొండ: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమని కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే ప్రభు చౌహాన్ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గత వారం రోజులుగా ఆయన దేవరకొండ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆదివారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, చెనమోని రాములు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ, కల్యాణ్‌నాయక్, గుండాల అంజయ్య, కొమ్ము వెంకటయ్య, జల్దా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: దేవరకొండ నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే ప్రభు చౌహాన్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా ఆదివారం చింతపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చెనమోని రాములు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, శివర్ల రమేశ్‌యాదవ్, కల్యాణ్‌నాయక్, బ్రహ్మచారి, బొడ్డు మహేశ్, సైదులు, అనిల్‌రెడ్డి, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం

మిర్యాలగూడ: రాష్ట్రంలోని యాదవులను ఆర్థికంగా, రాజకీయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని దామరచర్ల మండల గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలో యాదవ సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అప్పులు తెచ్చి డీడీలు కట్టిన యాదవులకు ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయకుండా మోసం చేస్తోందన్నారు. గొర్రెల పంపిణీ పథకం కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. రాష్ట్ర జనాభాలో పది శాతం ఉన్న యాదవులను రాజకీయంగా, ఆర్థికంగా ప్రభుత్వం అణిచివేస్తుందన్నారు. యాదవులందరూ ఐకమత్యంగా ఉండి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో గడ్డం ముత్తయ్య, గంగుల బంగారు, యాదగిరి, ఆవుల భిక్షంయాదవ్, జక్కుల అమరయ్య, రాంబాబు, జాల ఎల్లయ్య, నన్నె బోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ



మిర్యాలగూడ టౌన్: బోనంతో ముత్యాలమ్మ గుడికి వస్తున్న మహిళలు



మిర్యాలగూడ: ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న నల్లమోతు సిద్దార్థ

మిర్యాలగూడ: పట్టణంలోని తాళ్లగడ్డలో గల కట్ట ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు బాసాని గిరి, బాసాని అలివేలు, బంటు రమేష్, వింజం శ్రీధర్, కూసల గోపాలకృష్ణ, ఆయిల్ శ్రీను, తిరంశెట్టి కోటేశ్వర్‌రావు, ఎండీ షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు సమర్పణ..

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని గాంధీనగర్ కలాల్‌వాడలో గల ముత్యాలమ్మ గుడి వద్దకు ఆదివారం మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యంతో పాటు పసుపు, కుంకుమ, గాజులు, పూలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముత్యాలమ్మ గుడికి ఎదురుగా ఉన్న పోతరాజుకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కోళ్లను అమ్మవారికి బలి ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

సాగర్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్సీ కేఎస్ నవీన్

హాలియా: వచ్చే ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్సీ కేఎస్ నవీన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస యోజన ముగింపు సందర్భంగా ఆదివారం హాలియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించిందని విమర్శించారు. తెలంగాణలో కుటుంబ పాలనతో ప్రజలు విసిగిపోయారని, డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో విశ్వసించరని, తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీకి బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు కంకణాల నివేదితారెడ్డి, పానుగోతు రవినాయక్, మండల అధ్యక్షుడు మామిడి వినోద్, నాయకులు శంకర్, ప్రవీణ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ చలమల వెంకట్‌రెడ్డి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పునీత్, శంకర్, సాయిరాజు, రామదాసు తదితరులు ఉన్నారు.

ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలి



శెట్టిపాలెంలో ఎండిపోతున్న వరి పంటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములపల్లి: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వకు వెంటనే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామశివారులో బోరుబావుల కింద ఎండిపోతున్న పంట పొలాలను డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని పలువురు రైతులు బోరుబావుల కింద వరి సాగు చేస్తున్నారని, సకాలంలో వర్షాలు పడకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లలో సైతం నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. పెట్టిన పెట్టుబడులు వృథా అవుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, పల్లా వెంకటయ్య, బొంత పుల్లయ్య, పెదమాం నర్సమ్మ, నెమలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి

చందంపేట: 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు కావాలని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చందంపేట మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌ఓలు పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉంటారని, కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరణించిన వారిని గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాములు, అనిల్ తదితరులున్నారు.

ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



మిర్యాలగూడ అర్బన్ ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్: బీఆర్‌ఎస్ సర్కార్ ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కుర్ర సైదానాయక్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందని విమర్శించారు. అనంతరం 11మందితో నూతన కమిటీని ఎనుకున్నారు. కార్యక్రమంలో వంశీ, సమ్మద్, వినయ్, ఆనంద్ తదితరులున్నారు.

గురుకుల, మోడల్ స్కూల్ నిర్మించాలి

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలో గిరిజన గురుకుల స్కూల్, మోడల్ స్కూల్ నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర సైదానాయక్ అన్నారు. ఆదివారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మండలంలోని కస్తూర్బా పాఠశాలను ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు. అద్దె భవనాల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముల్కచర్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ ప్రదీప్‌ను పెద్దవూర మండల కేంద్రానికి డిప్యూటేషన్‌పై పంపడం సరికాదన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రవణ్, శివమణి, రవి తదితరులున్నారు.

చరిత్రకు సాక్ష్యం దేవరకొండ ఖిలా



పాటల సీడీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహ తదితరులు

దేవరకొండ: దేవరకొండ ఖిలా దుర్గం తరతరాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తుందని దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అన్నారు. దేవరకొండ ఖిలా ప్రాశస్త్యం గురించి తెలియజేస్తూ గుంటోజు వెంకటాచారి, శ్రీనివాసచారి ఆధ్వర్యంలో పాటల సీడీ రూపొందించారు. ఈ సీడీకి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం దేవరకొండ పట్టణంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచే వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్, వాసవెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి భీష్మాచారి, కొత్త సుబ్బారావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

చిట్యాల: గ్రామ పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జెండా పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెలిమినేడు గ్రామంలో జీపీ కార్మికుల జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్రూరి సాంబయ్య, నాతి వెంకట్రామయ్య, మహంకాళి బాలమ్మ, వలిగొండ లింగయ్య, అర్రూరి మల్లేశం, మహంకాళి మల్లమ్మ, గణేశ్, యాదయ్య, శంకరయ్య, రమణ పాల్గొన్నారు.